సగం కాల్చిన చుట్ట

టెంపోరావ్

ముగ్గురూ కలిసి కూర్చొని భోజనం చేస్తున్నారు. మేనక ఏదో చెప్తోంది. ఆమెవైపు అనురాగంతో చూస్తూ మోహన్ నవ్వుతున్నాడు.

ఐదేళ్ళ కుర్రాడు ఆనంద్ మెల్లిగా తింటున్నాడు.

మోహన్ టైమ్ చూశాడు.

"ఆనంద్, తొందరగా తినరా! సినిమా టైమవుతుంది" అన్నాడు తండ్రి.

తొమ్మిదింటి కల్లా వాళ్ళు భోజనాలు ముగించారు. ఆమె దుస్తులు ధరించి, మేకప్ చేసుకుంటోంది. ఆమె జడలో మల్లెపూల దండను అతడు నవ్వుతూ తురిమాడు.

అద్దం ముందున్న ఆమెవంక చూస్తూ వుండిపోయాడు.

"మోహన్, ఏమిటలా చూస్తున్నావు?" అందామె.

"నువ్వు మహా అందంగా వున్నావు. నిన్ను చూస్తూంటే సినిమా మానుకోవాలనిపిస్తోంది" అన్నాడతను.

"తిరిగి వచ్చేస్తాంగా! రాత్రంతా నీ పక్కనే

వుంటాను" అంది మేనక.

"ఈ దుస్తుల్లోనే వుండాలి."

"నీ కోరిక తీర్చుకుందుగానిలే!" అందామె నవ్వుతూ.

"సినిమాకు పదమ్మా" అన్నాడు ఆనంద్.

ఆనంద్‌ని ఫ్లాట్‌లో ఒంటరిగా వదల్లేరు. ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా ఆనంద్‌ని తీసుకెళ్ళడం వాళ్ళకు అలవాటై పోయింది.

ముగ్గురూ బయటకు నడిచారు. ఆమె ముందు తలుపును ఏర్‌లాక్ చేసింది. మెట్లుదిగి వాళ్ళు కిందకు వెళ్లారు.

ఎప్పటిలా ఆనంద్ స్కూటర్ సీటు ముందు నుంచున్నాడు. మోహన్ స్టార్ట్ చేసి కూర్చున్నాడు. వెనుక సీటు మీద ఆమె ఆశీనురాలైంది.

మోహన్ స్కూటర్ని పోనిచ్చాడు. చల్లటి గాలి వీస్తోంది. రోడ్డులైట్లు ప్రకాశవంతంగా వెలుతున్నాయి. ఒక చేత్తో ఆమె భర్తను పట్టుకుంది. వేళ్ళతో నిమురుతూ ఆమె తన ప్రేమను అతడికి ప్రదర్శిస్తోంది.

ముగ్గురూ థియేటర్లోకి ప్రవేశించారు.

మేనక తండ్రి కొడుకుల మధ్య కూర్చుంది. సినిమా ప్రారంభమైంది. ఇంటర్‌వెల్ సమయంలో లైట్లు వెలిగాయి. ముందు కుర్చీలో కూర్చున్న నలుగురు మనుషులు అప్పుడప్పుడు వెనుదిరిగి ఆమెవైపు చూస్తున్నారు.

వాళ్ళ చూపులను గుర్తించనట్లు ఆమె భర్తతో మాట్లాడుతూ కూర్చుంది.

"వాళ్లు అలా నా వైపు చూడ్డం మర్యాదగా లేదు!" అందామె తగ్గుస్వరంలో.

"నీ అంత అందమైన స్త్రీ వంక పురుషులు సహజంగా చూస్తారు. తప్పు వాళ్ళదికాదు, నీ అందానిది!" అన్నాడు

భర్త చిరునవ్వుతో.

"అయినా అలా చూడ్డం అన్యాయం! వాళ్ళకు సంస్కారం లేదు" అందామె.

"అది నిజమే! సంస్కారం వున్న వ్యక్తులు అలా చూడరు!" ఒప్పుకున్నాడు మోహన్.

సినిమా పూర్తయ్యేసరికి ఒంటిగంట అయింది. ముగ్గురూ బయటకు నడిచారు.

మోహన్ స్కూటర్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. ఎంత కష్టపడినా స్కూటర్ స్టార్ట్ కాలేదు. అతడు నిరుత్సాహంగా భార్యవైపు చూశాడు. ఆనంద్ ఆవులిస్తున్నాడు.

"మనం యివాళ కాళ్ళకు పని చెప్పాలేమో!" అన్నాడతను.

"పదండి నడిచిపోదాం! చల్లటి గాలి వీస్తోంది. హాయిగా వుంటుంది" అందామె.

తండ్రి ఆనంద్ వైపు చూశాడు.

"నడవగలవా?" అన్నాడు.

"చక్కగా నడుస్తాను, డాడీ" అన్నాడు ఆనంద్.

ఆనంద్ ముందు నడుస్తున్నాడు. వెనకనే స్కూటర్ని తోస్తూ మోహన్ అడుగులేస్తున్నాడు. మేనక తీయగా కబుర్లు చెప్తోంది. మూడు కిలోమీటర్ల దూరంలో వున్న యింటివైపు వాళ్ళు మెల్లిగా కదులుతున్నారు.

ఆనంద్ ఆగాడు. నిస్సహాయంగా తండ్రివంక చూశాడు.

"వాడింక నడవలేడనుకుంటాను" అంది మేనక.

"అయితే స్కూటర్ మీద ఎక్కి కూర్చో! తోసుకుపోతాను" అన్నాడు మోహన్.

ఆనంద్ సీటుమీద కూర్చున్నాడు. మోహన్ తోస్తూ మేనక మాటల్ని ఆలకిస్తున్నాడు.

మెయిన్ రోడ్డు నుంచి వాళ్లు ఎడంవైపుకు తిరిగారు.

"ఇది దగ్గర తోవ!" అన్నాడు మోహన్.

ఆమె రోడ్డు పొడుగునా చూసింది. మానవ సంచారం లేదు. ఆమె లోలోపల భయపడ్తోంది.

"మన స్కూటర్ని థియేటర్లో వదిలేసి ఏ ఆటోలోనో పోవలసింది" అందామె.

అతడు ఆమెవైపు చూశాడు.

"అలసటగా వుందా?"

"భయంగా వుంది!" అందామె.

"భయం దేనికి, నేను పక్కనున్నానుగా!" అన్నాడు మోహన్ ధీమాగా.

హెడ్ లైట్ల కాంతి వాళ్ళమీద పడింది. ఏదో కారు వస్తోంది. అతడు వెనక్కి తిరిగి చూశాడు.

"ఎందుకులే మోహన్! మనం నడిచే వెళ్దాం" అందామె.

కారు వాళ్ళ పక్కనే ఆగింది.

"మిస్టర్, ఎనీ ట్రబుల్?" అడిగాడు కారులో వున్న ఒక వ్యక్తి.

"స్కూటర్ స్టార్ట్ కావడంలేదు!" అన్నాడు మోహన్.

తలుపులు తెర్చుకుని కార్లోంచి నల్గురు మనుషులు కిందకు దిగారు. వాళ్ళవైపు చూసి మేనక వులిక్కిపడింది.

ఇంతకు ముందు వాళ్ళే థియేటర్లో తనవైపు పదేపదే చూశారు! నల్గురూ పాంట్లు, స్లాక్స్లో వున్నారు. గూండాల్లా కనిపిస్తున్నారు. తటాలున జేబుల్లోంచి వాళ్లు కత్తులను పైకి తీశారు. మెరుస్తూన్న కత్తులను చూసి

మోహన్ గభరాపడ్డాడు. ఆమె భర్త వెనక్కి జరిగింది. ఆనంద్ కిందుకురికి తల్లిచాటున దాక్కున్నాడు.

గదిలో యిరుక్కున్న పిల్లిలా మోహన్ ధైర్యాన్ని తెచ్చుకున్నాడు.

"మీకేం కావాలి, డబ్బా?" అడిగాడు మోహన్.

నలుగురూ పకపక నవ్వారు.

"అది మేం నీ కివ్వగలం. మాకు కావల్సింది—ఆమె!" అన్నాడొకడు.

మోహన్ వుగ్రుడయ్యాడు. "మర్యాదగా మాట్లాడండి. మీలాంటి జులాయి వెధవలు వందమంది నైనా ఎదిరించగలను!" గర్జించాడు మోహన్.

ఎలుగుబంటిలావున్న ముల్లా ముందుకు దూకి మోహన్ చంపమీద చళ్ళున వాయించాడు. మోహన్ నోట్లోంచి రక్తం చుక్కలు కిందపడ్డాయి. వెనువెంటనే ముల్లా బూట్‌తో పొట్టలో తన్నాడు. అతడి నోట్లోంచి చుట్ట దూరంగా పడింది. మోహన్ కింద పడ్డాడు.

"రాస్కెల్, ఎదిరించావా! నిన్నూ, నీ కొడుకునూ చంపి, ఆమెను లాక్కుపోతాం. అర్థమైందా?"

మోహన్ మూలుగుతూ లేచాడు. మేనక అతడిని పట్టుకుని ఆపింది.

"అంతమంది కిరాతకులతో నువ్వు పోట్లాడలేవు. నిన్నూ, బాబునూ చంపి వాళ్ళు నన్ను ఎలాగూ తీసుకుపోతారు. మీరు చావడం నా కిష్టంలేదు. వాళ్ళతో నన్ను వెళ్ళనీ! కనీసం మీరేనా బ్రతికి వుంటారు!" అందామె.

"నువ్వు లేకుండా నేనూ, బాబూ బ్రతకడం ఎందుకు?" అరిచాడు మోహన్.

"పొద్దుటే ఆమె నీ యింటికి వచ్చేస్తుంది!" అన్నాడు

ముల్లా.

క్షణకాలం అందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

"మోహన్, నా మాట విను!" అందామె.

"నువ్వు యింటికెళ్ళి పడుకో! ప్రొద్దుటే ఆమె వస్తుంది. పోలీస్ రిపోర్ట్ యివ్వకూడదు. ఇస్తే ఆమె శవం ఏ రోడ్డు పక్కనో పడుంటుంది" అరిచాడు ముల్లా.

మోహన్ మాట్లాడలేదు. అతడి కన్నీళ్ళు ఆమె చేతిమీద పడ్డాయి. ఆమె వెనక్కి తిరిగింది. వాళ్ళవంక చూసింది.

మౌనంగా వెళ్ళి కారులో కూర్చుంది. నలుగురూ ఎక్కి, తలుపులు మూశారు. కారు కదిలింది. వెనుదిరిగి ఆమె భర్త కొడుకులకేసి చూడలేదు!

కన్నీళ్ళు జలజల ఆమె కళ్ళనుంచి కారుతున్నాయి. ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆ కారు వెళ్ళిపోయిన కొన్ని నిమిషాలదాకా అతడిలో చలనం లేదు.

"వాళ్లెవరు డాడీ — బూచిగాళ్లా?" అడిగాడు ఆనంద్.

మోహన్ లేచాడు. కొడుకుని స్కూటర్ మీద ఎక్కించి, దాన్ని తోస్తూ నడవసాగాడు.

"అమ్మను వాళ్ళతో ఎందుకు పోనిచ్చావు డాడీ?"

ఆనంద్ ప్రశ్న కమ్చీలా అతడి ఒంటిమీద, హృదయంమీద ఛెళ్లుమంది!

"నిన్నూ, నన్నూ కాపాడ్డంకోసం మీ అమ్మ వాళ్ళతో వెళ్ళింది నాయనా! మీ అమ్మ చాలా గొప్పది!" అని మోహన్ ఏడుస్తూ స్కూటర్ని తోస్తున్నాడు.

2

ఇల్లు చేరుకున్న మరుక్షణంలో ఆనంద్ నిద్రపోయాడు. మోహన్ గదుల్లో తిరుగుతూ, అప్పుడప్పుడు కిటికీలోంచి బయటకు చూస్తూ వుండిపోయాడు.

టైమ్ కదుల్తోంది. మూడు దాటింది. గుర్రాల్లా ఆలోచనలు అతని మెదడులో పరుగెడుతున్నాయి.

మేనకను తను ఆ దుర్మార్గులతో పంపేశాడు! తను అసమర్థుడు. ఇటువంటి సమయంలో సినిమాలో హీరో వాళ్ళందర్నీ చావగొట్టి తరిమేస్తాడు. తను చవటలా ఆమెను వాళ్ళ కప్పగించి యింటికొచ్చాడు!

తనని తాను నిందించుకుంటూ మోహన్ సిగరెట్‌ను యాస్ట్రేలో పడేశాడు. యాస్ట్రే సిగరెట్ పీకల్తో నిండిపోయింది. ఇలా సిగరెట్ వెలిగించి, నాలుగు దమ్ములు పీల్చి అతడు పారేస్తున్నాడు.

అతడి మెదడంతా మేనకమీదే వుంది. ఆమెను వాళ్లు ఎంతగా హింసిస్తున్నారో! ఆమె ఎలా భరిస్తోందో!

మెదడులో ఆలోచనల పరంపరలు! భయంకరమైన దృశ్యాలు! ఆమె పొద్దుట నిజంగా తిరిగి వస్తుందా? వాళ్లు వెళ్ళనిస్తారా? అన్నీ అనుమానాలే!

అతడి కళ్ళు ఎర్రబడ్డాయి. ఆమెను గురించి ఆలోచిస్తూ అతడు లోలోపల కుమిలిపోతున్నాడు. ఏడుస్తున్నాడు. మానసిక క్షోభను తట్టుకోలేకపోతున్నాడు.

అతడు మళ్లా టైమ్ చూశాడు. మూడూ పదిహేను అయింది. కాలచక్రం నత్తలా కదుల్తోంది. అతడు మెల్లిగా వెళ్ళి బీరువా తెరిచాడు. లోపలున్న బ్రాందీ బాటిల్ను పైకి తీసి తలుపుమూశాడు.

అతడు రిఫ్రిజిరేటర్‌లోంచి ఒక బుడ్డీ చల్లటి నీళ్ళు

తీశాడు. గ్లాసులో బ్రాందీపోసి, నీళ్ళు కలిపి గడగడ తాగేశాడు. మూడు పెగ్గులు తాగాక అదో విధమైన ధైర్యం అతడిని ఆవరించింది. బ్రాందీ మనిషిలో సృష్టించే కృత్రిమ ధైర్యం!

అతడు పిడికిలి బిగించాడు. ఆ కారు నంబరు తను చూశాడు. మేనక తిరిగొచ్చాక తను వెళ్ళి ఆ నలుగుర్నీ చిత్తు చేయాలి. వాళ్ళను ముక్కలు చెక్కలుగా నరకాలి! అతడు ఉద్రేకంతో కుర్చీలోంచి లేచాడు.

తూలుతూ కింద కూలిపోయాడు. మొజాయిక్ ఫ్లోర్ మీద లేచి కూర్చున్నాడు. టీపాయి మీదున్న బాటిల్ వంక చూశాడు.

గదిలోని వస్తువులు అతడి కళ్ళకు లీలగా కనిపిస్తున్నాయి. అతడు గ్లాసులో మళ్ళీ బ్రాందీ పోసుకున్నాడు. మైకంలో వుండడంవలన గ్లాసులో బ్రాందీ ఎక్కువగా పోశాడు. నీళ్ళుపోసి, నేలమీద కూర్చుని తాగుతూ కూర్చున్నాడు.

గ్లాసు ఖాళీ అయింది. దాన్ని టీపాయిమీద పెట్టి అతడు నేలమీద వెల్లకిలా పడుకున్నాడు.

అతడికి తెలియకుండా నిమిషాలు గడుస్తున్నాయి.

ఆరు కావస్తోంది.

ఎవరో తలుపును తట్టారు. తూలుతూ అతడు లేచి వెళ్ళాడు. పాలు తెచ్చే మనిషి అయివుంటుంది!

అతడు తలుపు తెరిచాడు.

బయట వాలిపోయిన ముఖంతో మేనక నిలబడి వుంది!

ఆమె అతడి వంక చూడలేదు. చఱ్ఱున లోపల కెళ్ళింది.

అతడు తలుపును దగ్గరగా మూసి ఆమెవైపు వెళ్ళ

బోయాడు. ఆమె దూరంగా జరిగింది.

"నువ్వు తిరిగొచ్చినందుకు చాలా సంతోషిస్తున్నాను మేనకా," అన్నా డతను.

ఆమె అతడివైపు చూడలేదు.

"స్నానంచేసి వస్తాను. అప్పుడు మాట్లాడుదాం," అని ఆమె లోపలకు వెళ్ళింది.

అతడు హాల్లో నేలమీద కూర్చుండిపోయాడు. అతడి హృదయంలోంచి ఆనందం పొంగుకొస్తోంది. ఆమె తిరిగి వస్తుందో, రాదో అని అతడు సతమత మయ్యాడు. ఆమె యింటికి తిరిగొచ్చింది. అదే చాలు. తనకోసం, కొడుకు కోసం ఆమె ఎంత నరకయాతన్ని భరించి, బయట పడిందో!

అతడు లోపల గదులవైపు చూస్తున్నాడు. ఆమె రాకకోసం ఎదురు చూస్తున్నాడు. ఎవరో తలుపును తట్టారు.

అతడు ముందు గుమ్మంవైపు వెళ్లి తలుపు తెరిచాడు. పాలమనిషి. ఆమె యిచ్చిన పాత్రను తీసుకుని లోపలకు వెళ్ళాడు.

టేబుల్ మీదున్న పాత్రలో పాలు పోస్తూండగా సగం పైన కింద పడ్డాయి. నేలమీద పడిన పాలవంక విచారంతో చూస్తూ అతడు ఖాళీ పాత్రను తీసుకుని నడుస్తూ బాత్ రూమ్ ముందు క్షణం ఆగాడు. తలుపు మూసి వుంది.

అతడు పాత్రను పాలమనిషికిచ్చేసి తలుపు మూశాడు. భార్య రాకకోసం యెదురుచూస్తూ సోఫాలో చతికిల బడ్డాడు.

భయంకరమైన అరుపులు లోపల్నుంచి ధ్వనించాయి.

అతడు లోపలకు పరుగెత్తాడు. బాత్‌రూం తలుపు తోశాడు. అక్కడి దృశ్యాన్ని చూసి అతడు తారెత్తి పోయాడు.

ఆమె కట్టుకొన్న గుడ్డలు కాలిపోతున్నాయి. మంటల్లో మాడిపోతోంది మేనక! సమీపంలో కిరసనాయిల్ డబ్బా వుంది.

అతడు గట్టిగా అర్చాడు. నేలమీద పడి ఆమె మండుతూ దొర్లుతోంది. ఏం చెయ్యాలో తోచక అతడు బకెట్‌లోని నీళ్ళను ఆమెమీద పోశాడు. కాని మంటలు ఆరిపోలేదు. అతడు బయటకెళ్ళాడు. దట్టంగా వున్న తివాసీ తెచ్చి ఆమెమీద కప్పేశాడు.

తివాసీ కిందున్న ఆమె కదలడంలేదు. అతడు తివాసీని పెకి తీశాడు. ఆ ఘోర దృశ్యాన్ని చూసి అతడు భయంకరంగా అర్చి నేలకూలిపోయాడు.

బయటనుంచి యెందరో తలుపును తట్టుతున్నారు. అతడు వినే స్థితిలో లేడు. ఎవరో వచ్చి అతడిమీద పడ్డారు. అతడు కళ్ళు తెరిచాడు. కొడుకు ఆనంద్.

"డాడి! డాడీ!"

అతడు కొడుకువైపు చూశాడు.

"ఎవరో తలుపు కొడుతున్నారు!" అన్నాడు ఆనంద్.

అతడు లేచాడు. మెల్లిగా, సత్తువ లేనట్లు నడుస్తూ వెళ్ళి ముందు తలుపు తెరిచాడు. బయట డజనుమంది నిలబడి వున్నారు.

"అరుపులు విని వచ్చాం. ఏమైంది, మిస్టర్ మోహన్?" అన్నాడు పక్క ఫ్లాట్‌లో వుండే రామలింగం.

మోహన్ జవాబుగా చేత్తో లోపలకు చూపించాడు,

రామలింగం తదితర్లు వేగంగా లోపలకు వెళ్ళారు.

లోపల కెళ్ళినవాళ్ళు హాల్లోకి తిరిగివచ్చారు. రామలింగం మెల్లిగా మోహన్ భుజంమీద చెయ్యి వేశాడు.

"ఇంత ఘోరంగా ఆమె ఎలా మరణించింది? యాక్సిడెంట్ అయిందా?"

అదే ప్రశ్న యితర్లు అడిగారు. మోహన్ చెవులు మూసుకున్నాడు.

"ప్లీస్, నన్నడక్కండి! చెప్పలేను. ఎవరేనా పోలీసులకు ఫోన్ చేసి రమ్మనండి" అన్నాడు మోహన్.

రామలింగం, మరి కొందరు బయటకు వెళ్ళారు. రామలింగం భార్య ఆనంద్‌ని తీసుకెళ్ళడానికి ప్రయత్నించింది. కాని ఆనంద్ తండ్రిని వదల్లేదు.

ఎవరెవరో లోపలకు వెళ్ళి శవాన్ని చూసి హాల్లో కొచ్చి అతడితో ఏదో అంటున్నారు. కాని అదంతా అతడికి వినపడ్డంలేదు.

మోహన్ ఆలోచిస్తున్నాడు. తననీ, కొడుకునీ రక్షించాలనే వుద్దేశంతో ఆమె వాళ్ళ కూడా వెళ్ళింది. తిరిగొచ్చాక తన ముఖం చూడలేక, ఆమె తన ప్రాణాన్ని తీసుకుంది.

ఆమె ఏం తప్పు చేసింది? ఆమె ఏ తప్పూ చెయ్యలేదు. ఆమె దేవత. తన హృదయ జ్యోతి, యింటి దీపం ఆరిపోయింది. ఎంత అపరాధానై్ననా తనభర్త మన్నించగలడన్న విషయం ఆమె మర్చిపోయింది. తనకు మాట్లాడే అవకాశం కూడా లేకుండా ఆమె మరణమందిరంలోకి దూరింది!

పిచ్చివాడిలా మోహన్ ఆలోచిస్తున్నాడు.

"డాడీ అమ్మ బాత్‌రూమ్‌లో పడుకుందేం?" ఆనంద్

అమాయకంగా అడిగాడు.

మోహన్ కన్నీళ్ళు తటాలున ఆనంద్ మీద జల జల రాలాయి.

3

ఇన్‌స్పెక్టర్ నాయర్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి కాలి నగ్నంగా వున్న శవాన్ని చూశాడు. శవం పక్కన కిర్సనాయిల్ డబ్బా వుంది. కొంచెం దూరంలో టాప్, పైన పవర్ వున్నాయి.

ఆమె శరీరం ఘోరంగా మాడిపోయింది. చూసే వాళ్ళ గుండెలు దడ దడ మనేటట్లు వుందా దృశ్యం.

ఇన్‌స్పెక్టర్ ముందు హాల్లోకి వెళ్ళాడు. మోహన్, కొడుకు అలాగే కూర్చుని వున్నారు.

"మిస్టర్ మోహన్, ఏదేనా పాత చీర వుంటే శవాన్ని కప్పొచ్చు" అన్నాడు నాయర్.

"అనవసరం, యిన్‌స్పెక్టర్! కప్పడానికి ఇక్కడేముంది?" అని వాపోయాడు మోహన్.

"ఏం జరిగిందో చెప్పండి."

"ఆమె ఆత్మహత్య చేసుకుని సుఖంగా మమ్మల్ని విడిచి వెళ్ళిపోయింది."

"ఎందుకలా జరిగింది?"

మోహన్ గది నలువైపులా చూశాడు. ఒక కానిస్టేబుల్ దూరంగా నిలబడి వున్నాడు.

"నేను చెప్పేది మీరు తప్ప యెవరూ వినకూడదు."

"ఆల్‌రైట్," అని ఇన్‌స్పెక్టర్ నాయర్ కానిస్టేబుల్ని బయటకు పొమ్మని సౌజ్ఞ చేశాడు.

ఏదీ దాచకుండా జరిగినదంతా మోహన్ ఏడుస్తూ చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్ మౌనంగా అంతా

విన్నాడు. కారు నెంబర్ను యిన్‌స్పెక్టర్ రాసు కున్నాడు.

"ఇన్‌స్పెక్టర్, అదీ కథ. ఈ మహాపట్నంలో అటు వంటి దుర్మార్గులు సంచరిస్తున్నారు" అన్నాడు.

ఎవరో తలుపును తట్టారు.

"కమిన్," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

డాక్టర్ సుధాకర్ లోపలకు వచ్చాడు. అతడిని నాయర్ బాత్‌రూమ్‌లోకి తీసుకు వెళ్ళాడు. కాస్సేపట్లో నాయర్ హాల్లోకి తిరిగి వచ్చాడు.

"సినిమా టికెట్ల కౌంటర్‌ఫోయిల్స్ మీ దగ్గర వున్నాయా?"

మోహన్ పాంటు జేబు వెతికి మూడు టికెట్ల కౌంటర్ ఫోయిల్స్‌ను నాయర్‌కి యిచ్చాడు.

"మీ స్కూటర్ ఎక్కడుంది?"

"కింద."

"దాని కీ యివ్వండి."

పాంటు జేబులోంచి స్కూటర్ కీ తీసి అతడు ఇన్‌స్పెక్టర్‌కి ఇచ్చాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్ బయటకు వెళ్లి పోయాడు.

కిందనున్న స్కూటర్ని పరీక్షించారు నాయర్. అది స్టార్ట్ అవలేదు. తతిమ్మా ఫ్లాట్స్‌లో వున్నవాళ్ళను కలుసుకుని మోహన్ గురించి ఇన్‌స్పెక్టర్ నాయర్ వివరాలు తెల్సుకున్నాడు. మోహన్ అతడి భార్య గురించి అందరూ ఒకే విధంగా చెప్పారు.

"ఐడియల్ కాపుల్ సార్! వాళ్ళను చూస్తుంటే మేడ్ ఫర్ యీచ్ అదర్ అడ్వర్‌టైజ్‌మెంట్లు గుర్తు కొస్తాయి. చాలా, హాయిగా, ఆనందంగా జీవించే

వారు!" అన్నా రందరూ.

ఇన్‌స్పెక్టర్ నాయర్ శవం వున్న గదిలోకి వెళ్లాడు. ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ తన పని ముగించి నాయర్ వైపు చూశాడు.

"ఈ డబ్బామీద ఆమె వేలిముద్రలు వున్నాయి," అన్నా డతను.

శవం ఫోటోలు తీస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ బయట నున్న నడవలోకి వెళ్లి డాక్టర్ సుధాకర్‌తో మాట్లాడి హాల్లోకి తిరిగివచ్చాడు.

హాల్లో కూచ్చున్న మోహన్ వైపు ఓసారి చూశాడు. గదిలో పచార్లు చేస్తూ ఆలోచించసాగాడు. ఆత్మహత్య చేసుకునేవాళ్లు సాధారణంగా వుత్తరం రాస్తారు. కాని ఆమె రాసినట్లు లేదు. మోహన్ చెప్పినదంతా అతడి మెదడులో తిరిగింది. ఆ స్తితిలో ఆమె వుత్తరం రాయ లేదు!

మోహన్ యెదురుగా వున్న యిన్‌స్పెక్టర్ వైపు చూశాడు.

"ఇన్‌స్పెక్టర్, ఒక విన్నపం!" అన్నాడు.

"ఏమిటి?"

"నా భార్య మేనక మరో లోకంలోకి వెళ్ళి పోయింది. ఏదో జరిగిపోయింది, ఎవరూ ఆపలేని పరి స్తితుల్లో. ఆమె పేరు, నా పేరు బయటపడ్డం నా కిష్టం లేదు. దయ చేసి పత్రికల వాళ్ళకు మా పేర్లు యివ్వ కండి."

"మిస్టర్ మోహన్, మీ పేర్లు ఎక్కడా బయట పెట్టను. మీరు బెంగ పెట్టుకోకండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

మేనక శవాన్ని స్ట్రెచర్ మీద బయటకు మోసుకు పోతున్నారు, పోస్టుమార్టమ్‌కి. మోహన్ కొడుకు లేచి మౌనంగా నిలబడ్డారు, పాలిపోయిన ముఖాలతో.

స్ట్రెచర్ వెళ్ళిపోయింది. మోహన్ సోఫాలో కూలి పోయాడు. అతడి కాళ్ళమీద ముఖాన్ని ఆనించి ఆనంద్ పడుకొన్నాడు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ విచారవదనంతో మోహన్ ముందుకు నడిచాడు.

"మిస్టర్ మోహన్, జరిగినదానికి నేను చాలా విచారిస్తున్నాను. ఆమె మీకు ఒక కొడుకు నిచ్చి వెళ్ళిపోయింది. అతడి అభివృద్ధికోసం తాపత్రయ పడండి."

మోహన్ ఇన్‌స్పెక్టర్ వంక కన్నీళ్ళతో చూశాడు. "ఆనంద్‌కోసం బతకాలి! వీడు లేకపోతే ఆమెతో నేనూ వెళ్ళిపోయి వుండేవాణ్ని."

ఇన్‌స్పెక్టర్ నాయర్ బయటకు వెళ్ళిపోయాడు.

4

దినపత్రికలో మొదటి పేజీలో వచ్చిన కన్నీటి గాథను డిటెక్టివ్ పరశురామ్ చదివాడు. అతడి హృదయాన్ని ఎవరో సూదులతో పొడుస్తున్నట్లు అనిపించింది.

పక్కనున్న పార్వతికి పేపరిచ్చి చదవమన్నాడు. ఆమె బాధతో చదివింది. క్షణకాలం కళ్ళు మూసుకొంది. తెరవగానే ఆమె కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

పరశురామ్ భార్య భుజంమీద చెయ్యివేశాడు. ఆమె వైపు ఆప్యాయంగా చూశాడు.

"పారూ, వాళ్ళ పేర్లు పత్రికలో రాలేదు. అయినా

యీ అన్యాయం యే యిల్లాలికి జరిగిందో కనుక్కొని ఆ దుష్టులను తగు విధంగా శిక్షిస్తాను," అన్నాడు పరశు రామ్.

"వెంటనే చేయండి. మరో స్త్రీకి యిలా జరగ కూడదు," అంది పార్వతి.

పరశురామ్ టైమ్ చూశాడు. పది కావస్తోంది. రిసీవ రెత్తి ఒక నెంబరు తిప్పాడు.

"హలో, ఇన్‌స్పెక్టర్ నాయర్?" అంది అటువైపు కంఠం.

"నాయర్ భాయ్, ఇవాళ పేపర్లో మొదటి పేజీలో పడ్డ వార్త చూశావా?"

"చూశాను, బ్రదర్. చాలా ట్రాజిక్."

"ఆ కేసును నువ్వు పరిశోధిస్తున్నావా?"

"యస్, బ్రదర్."

"వాళ్ళ గురించి నాకు చెప్పగలవా?"

"బ్రదర్, ఆఫీసుకు రాగల్గితే రా. అంతా నీకు చెప్తాను."

"వెంటనే వస్తున్నాను," అని పరశురామ్ రిసీవర్ని పెట్టేశాడు.

కెటిల్లోని కాఫీని పార్వతి కప్పులో పోసింది. అతడు వేగంగా తాగి, లోపల గదిలోకి వెళ్ళాడు. దుస్తులు మార్చుకుని పరశురామ్ మెట్లమ్మట కిందకు పరుగెత్తాడు.

ఇన్‌స్పెక్టర్ నాయర్కి యెదురుగా పరశురామ్ కూర్చున్నాడు. పైన ఫాన్ తిరుగుతోంది. నాయర్ టేబుల్ మీద పది దినపత్రిక లున్నాయి, అనేక భాషల్లో.

"బ్రదర్ వాళ్ల పేర్లు యెవ్వరికీ చెప్పవద్దని అత

నన్నాడు. అందువలననే పత్రికల్లో వాళ్ళ పేర్లు రాలేదు. జరిగినది మాత్రం చిత్రించబడింది," అన్నాడు నాయర్.

పరశురామ్ ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించి, పొగ వదుల్తూ నాయర్ వంక సూటిగా చూశాడు.

"నేను ఆ అభాగ్యురాలి భర్తను కల్సుకుని మాట్లాడాలి! ఈ గూండాలకోసం నేను వేటాడదల్చాను."

నాయర్ అంతా చెప్పాడు.

"కారు నెంబర్ని గురించి దర్యాప్తు చేశాను. అది నకిలీ నెంబర్ ప్లేట్. మోహన్ చూసిన కారు అంబాసిడర్. ఆ నెంబరున్న కారు మోరిస్," అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"అతడు యింట్లోనే వుంటాడుగా?"

"నెల రోజులపాటు లీవు పెట్టానని చెప్పాడు. ఇంట్లోనే వుంటాడు. అతడి పేరు పత్రికలవాళ్ళ చెవుల్లో పడకుండా చూడు!"

పరశురామ్ కుర్చీలోంచి లేచాడు. నాయర్‌కి బై బై చెప్పి అతడు బయటకు నడిచాడు.

5

డాడ్జి కారును పరశురామ్ వేగంగా పోనిచ్చాడు.

పదిహేను నిమిషాల్లో పెద్ద భవనం ముందు కారు ఆగింది. మెట్లెక్కి అతడు పైకి వెళ్ళాడు. నెంబర్ 8 ఫ్లాట్ తలుపు ముందు ఆగాడు. వేళ్ళతో తలుపును తట్టాడు.

తలుపు తెరవబడింది. ఎదురుగా వున్న వ్యక్తి వంక పరశురామ్ సానుభూతితో చూశాడు.

అతడు జీవచ్ఛవంలా వున్నాడు. బాగా మాసిన

గడ్డం. ఎఱ్ఱబడిన కళ్ళు. మనిషి నీరసంగా అగుపిస్తు న్నాడు. అమాంతంగా అతడి వయస్సు ఏ యిరవై ఏళ్ళో పెరిగినట్లు కనిపిస్తున్నాడు.

"మిస్టర్ మోహన్, అయామ్ డిటెక్టివ్ పరశురామ్" అన్నాడతను.

అతడు శూన్యంలోకి చూసినట్టు చూశాడు.

"మీకేం కావాలి?" జీవంలేని కంఠంతో అడిగాడు మోహన్.

"మీతో మాట్లాడాలి."

"అంతా అయిపోయింది. ఇక మాట్లాడ్డం దేనికి? క్షమించండి."

అతడు తలుపు మూయబోయాడు. పరశురామ్ తటా లున లోపలకు దూరి వీపుతో తలుపు మూశాడు.

మోహన్ మెల్లిగా వెళ్ళి సోఫాలో కూలిపోయాడు. అతడి కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

పరశురామ్ అతడి దగ్గరగా వెళ్ళి చెయ్యి పట్టు కున్నాడు.

"మిస్టర్ మోహన్, మీకు జరిగినదాన్ని గురించి ఒక దిన పత్రికలో చదివాను. ఆ దుర్మార్గులను బంధించి చిత్ర వధ చెయ్యాలనే దృఢ నిశ్చయంతో యిలా వచ్చాను. మీ పేరు బయటకు పొక్కకుండా నేను జాగ్రత్త పడ్డాను" అన్నాడు పరశురామ్.

"పరశురామ్‌గారూ, మరో లోకంలో సుఖంగా నిద్ర పోతున్న ఆమెను లేపడం నా కిష్టంలేదు" అన్నాడతను.

"మరణించిన వాళ్ళను ఎవ్వరూ లేపలేరు. కాని బ్రతి కున్న వాళ్ళ జీవితాలు ధ్వంసం కాకుండా జాగ్రత్తపడ్డం మన కర్తవ్యం. ఆ కిరాతకులను అలా వదిలేస్తే ఇలాగే

మరికొన్ని నిండు సంసారాలను వాళ్ళు కూలగొడ్తారు."

"నన్నేం చెయ్యమంటారు?"

"నా ప్రశ్నలకు జవాబివ్వండి."

పరశురామ్ నలువైపులా చూశాడు.

"మీ అబ్బాయి ఆనంద్ ఏడి?"

"వాడిని స్కూల్లో వదిలివచ్చాను. నాతో కూర్చుంటే నాలాగే పిచ్చివాడవుతాడు!"

"కార్లోనుంచి దిగిన ఆ నలుగుర్నీ యింతకు ముందు మీరు ఎప్పుడేనా చూశారా?"

"థియేటర్లో వాళ్ళు మా ముందు కుర్చీల్లో కూర్చున్నారు. ఇంటర్వెల్లో వెనుదిరిగి నా భార్యవైపు పదేపదే చూశారు. అది నా భార్య గమనించింది. నాతో కూడా చెప్పింది. అప్పట్లో నేనదంతా లైట్‌గా తీసుకున్నాను."

"వాళ్ళను గురించి మీకు తెలిసినది, వూహించింది చెప్పండి. వాళ్ళను వర్ణించండి!"

"ఇద్దరు పొట్టిగా, లావుగా వున్నారు. ఇద్దరు పొడుగ్గా సన్నంగా వున్నారు. ఖరీదైన పాంట్లు, స్లాకుల్లో వున్నారందరూ. బీదవాళ్ళయి వుండరు. చేతులకు మంచి వాచీలు వున్నాయి. అందరూ మందు సేవించి సినిమా కొచ్చారని తెలుస్తోంది. వాళ్ళు మాట్లాడుతుంటే బ్రాందీ వాసన కొడ్తోంది. వాళ్ళు దిగిన కారు నల్లటి అంబాసిడర్. అందరి చేతుల్లోనూ బటన్ నొక్కితే పైకెగిరివచ్చే కత్తులున్నాయి. ఇటువంటి నేరాలు చేయడంలో ఆరితేరినవాళ్ళయి వుండాలనిపించింది నాకు."

మోహన్ ఆగాడు. మొహాన్ని చేత్తో కప్పుకొన్నాడు.

"మిస్టర్ మోహన్! మీరు నెల దాకా లీవు

పెట్టారా?"

అతను తలాడించాడు.

"నేను వాళ్ళ కోసం రాత్రిళ్ళు వెంటాడుతాను. మీరూ నాతో సహకరిస్తూ పని చేయొచ్చు. రాత్రిళ్ళు స్కూటర్ మీద మీరు తిరగండి. వాళ్ళు ఎక్కడేనా కనబడితే నా నెంబరుకి వెంటనే ఫోన్ చేయండి."

"తిరిగితే మేనక వస్తుందా?"

"ఆ దుర్మార్గులను పట్టి శిక్షిస్తే మేనక ఆత్మకు శాంతిని కలిగించిన వారవుతారు."

"మీరు చెప్పింది నిజమే!" అని వూరుకొన్నాడతను.

జేబులోంచి ఒక విజిటింగ్ కార్డు తీసి పరశురామ్ అతడి కిచ్చాడు.

"మీ కొడుకు ఆనంద్ ఒంటరిగా వుండనవసరం లేదు. అతడు నిద్రపోయాక మీరు తిరిగొచ్చు. కొంతకాలం పాటు అతడికి తోడుగా వుండడానికి ఏ పనిమనిషినో మీరు నియమించండి."

"అలాగే చేస్తాను. మా పనిమనిషి మంగమ్మ యిక్కడే వుండి వాడిని చూసుకుంటుంది."

పరశురామ్ అతడివంక సూటిగా చూశాడు.

"మీ సహాయంతో ఆ దుర్మార్గులను పట్టుకోగలననే నమ్మకం నాకుంది" అని అతడితో కరచాలనం చేసి పరశురామ్ బయటకు వెళ్ళాడు.

వేగంగా మెట్లు దిగి తన కారువైపు నడిచాడు.

6

ఆనంద్ నిద్రపోతున్నాడు. మోహన్ టైమ్ చూశాడు. పది కావస్తోంది.

అతడు ముందుగదిలో కొచ్చాడు. మంగమ్మ నేలమీద

కూర్చుని వుంది.

"మంగమ్మా, చాప వేసుకొని బాబున్న గదిలోపడుకో. వాడిని జాగ్రత్తగా చూసుకో!"

అతడు బయటకు నడిచాడు. ముందు తలుపును ఏర్ లాక్ చేశాడు. మెట్లమ్మట దిగుతూ అతడు ఆలోచించ సాగాడు. వాళ్ళకోసం ఎక్కడ వెతకాలి?

ఆ రాత్రి తను వెళ్ళిన "రీనా" థియేటర్లో వాళ్ళు వుంటారేమో!

అతడు స్కూటర్ని పోనిచ్చాడు. థియేటర్ కాంపౌండులో స్కూటర్ ఆపి లాక్ చేసి, లోపలకెళ్ళి టికెట్ కొన్నాడు. థియేటర్లోకి నడిచాడు.

హాల్లో చీకటిగా వుంది. ఇండియన్ న్యూస్ రివ్యూ సాగుతోంది. అతడు ఒక కుర్చీలో కూర్చుని నలువైపులా చూశాడు. ఎన్నో ఆకారాలు! ఎవర్నీ అతడు స్పష్టంగా చూడలేకపోయాడు. ఇంటర్వెల్లో లైట్లు వెలిగాక తను చూడొచ్చు!

వాళ్ళ అంబాసిడర్ కారు అతడికి గుర్తొచ్చింది. వాళ్ళు థియేటర్లో వుంటే కారు కాంపౌండ్లో వుండాలి! ఈ ఆలోచన తట్టగానే అతడు బయటకు వెళ్ళాడు.

కాంపౌండు నలువైపులా చూశాడు. అరడజన్ కార్లు వున్నాయి. ఒక బ్లూ అంబాసిడర్ కారు వుంది. తతిమ్మావి వేరే కార్లు. వాళ్ళు యీ థియేటర్కి రాలేదు. మరెక్కడికో వెళ్ళుంటారు.

అతడు స్కూటర్ వంక నడిచాడు. కాస్సేపు మౌనంగా నిలబడ్డాడు. ఆ నాటి రాత్రి తనూ, మేనకా, ఆనంద్ గేటు దాటి నడుస్తూ వెళ్ళడం అతడికి గుర్తొచ్చింది. ఏదో బాధ అతడిని వేధించింది,

స్కూటర్ని స్టార్టుచేసి అతడు కూర్చొని పోనిచ్చాడు. ఆనేక రోడ్లమ్మట తిరిగాడు. రెస్టారెంట్ల ముందు ఆపి నల్లటి అంబాసిడర్ కోసం చూశాడు. ఎక్కడా వాళ్ళు తటస్థపడలేదు.

పేపర్లలో పడిన వార్తను చదివి, భయపడి వాళ్ళు ఎక్కడో దాగున్నారేమో! కొంతకాలందాకా బయటకు రారేమో!

ఒక రెస్టారెంట్లోంచి అతడు పరశురామ్కి ఫోన్ చేశాడు.

"హలో!" అందొక తియ్యటి స్త్రీ కంఠం.

"పరశురామ్గారు కావాలి."

"మీ పేరు?"

"మోహన్."

"పరశురామ్గారి భార్యని? వాళ్ళెక్కడేనా కనిపించారా?" అడిగిందామె.

"లేదు."

"రాక్షసుల్ని వెదికి పట్టుకోడానికి కొంత టైము పడుతుంది. పరశురామ్గారు పట్నంలో తిరుగుతున్నారు. ఎక్కడో మీకు కనపడొచ్చు!" అందామె.

"మీ నిద్రకు భంగం కల్గించినందుకు మన్నించండి" అన్నాడతను.

"మిస్టర్ మోహన్, యీ సంఘటన్ని గురించి చదివాక నాకు నిద్రపట్టడం లేదు. వేలాది స్త్రీలు నాలాగే భావిస్తూ వుండాలి, నిర్విరామంగా వేటాడండి! చివరకి మీరు జయిస్తారు" అందామె.

అతడు రిసీవర్ని పెట్టేశాడు. కుర్చీలో కూర్చుని టీ ఆర్డరిచ్చాడు. వేడి టీ తాగి అతడు బిల్లు చెల్లించి బయటకు

నడిచాడు.

ఆనాటి రాత్రి వాళ్ళు తనకు తటస్థపడిన రోడ్డువైపు స్కూటర్ని తిప్పాడు మోహన్. ఆ రోడ్డుమీద వుండే కొన్ని లైట్లు పగిలిపోయాయి. అందువలన చీకటిగా వుంది.

అతడు స్కూటర్ని మెల్లిగా పోనిస్తున్నాడు. స్కూటర్ కాంతిలో రోడ్డు వారగా ఒక కారు ఆగి వుంది. అతడు వులిక్కిపడ్డాడు. వాళ్ళు కారు మార్చారేమో!

కారు పక్కనే అతడు స్కూటర్ని ఆపాడు. కారులో ఎవ్వరూ లేరు. దూరంనుంచి ఏదో టార్చికాంతి అతడిమీద పడింది.

ఎవరో అతడివైపు వేగంగా వస్తున్నారు. బూట్ల చప్పుడు!

"మిస్టర్ మోహన్, మీరా?" అన్నాడు పరశురామ్.

"మీ కోసం ఫోన్ చేశాను" అన్నాడు మోహన్.

"ఏమేనా చెప్పాలా?"

"ఎక్కడా వాళ్ళు పత్తాలేదు."

"నేరాలు చేసేవాళ్ళు జాగ్రత్తపడ్తారు. మనం చెయ్యి చాచగానే దొరికిపోరు! వాళ్ళకోసం మనం వెతుకుతూనే వుండాలి" అన్నాడు పరశురామ్.

"మీ రిక్కడ కెందుకొచ్చారు?" ప్రశ్నించాడు మోహన్.

"ఒకతను మీతో యీ ప్రదేశంలో మాట్లాడాడు. ఆ సమయంలో ఏదేని అతడి వస్తువు యిక్కడ పడిందేమో అని వెతికాను."

"ఏదేనా దొరికిందా?"

పరశురామ్ తన చేతిలో వున్న వస్తువు మీదకు

టార్చిని తిప్పాడు. సగం కాల్చిన ఖరీదైన చుట్ట!

"ఇది వాళ్ళదో కాదో చెప్పలేను?" అన్నాడు పరశురామ్.

మోహన్ క్షణకాలం మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

"పరశురామ్‌గారూ, నన్ను తన్నినపుడు అతడి నోట్లోనుంచి కాలుతున్నదేదో కిందపడ్డం నాకు గుర్తుంది. ఈ చుట్ట అతనిదే కావచ్చు" అన్నాడు మోహన్.

"గుడ్, మన పరిశోధన ముందుకు వెళ్తోంది. ఆ నలుగురిలో ఒకడు చుట్టలు కాలుస్తాడని మనం అనుకోవచ్చు," అన్నాడు పరశురామ్.

మరి కొంతసేపు మాట్లాడి యిద్దరూ విడిపోయారు. డాడ్జికారుని శరవేగంగా పోనిచ్చాడు పరశురామ్.

టైమ్ చూశాడు. ఒంటిగంట కావస్తోంది. ఒక థియేటర్ ముందు కారాపి పరశురామ్ కార్లో కూర్చుని బయటకు చూశాడు.

గుంపులు గుంపులుగా జనం బయట కొస్తున్నారు. ఎన్నో కార్లు బయటకొచ్చి రోడ్డమ్మట పోతున్నాయి. ఒక నల్ల అంబాసిడర్ కారు మీదకు అతడి దృష్టి వెళ్ళింది. అందులో ఒక పురుషుడు, స్త్రీ, పిల్లలు కూర్చుని వున్నారు. ఆ కారు తనకు కావల్సింది కాదు!

ఏదో ఆలోచన తట్టి పరశురామ్ కారును థియేటర్ కాంపౌండ్‌లోకి పోనిచ్చి కార్లు ఆగే పార్కింగ్ స్థలంలో ఆపాడు. ఒక యువకుడు కారువైపు పరుగెత్తుకొచ్చాడు.

పరశురామ్ అతడివంక నవ్వుతూ చూశాడు. "ఇక్కడ ఆపిన కార్లకు నువ్వు వాచ్‌మన్‌వా?"

"అవును సార్."

"నలుగురు పురుషులు నల్లటి అంబాసిడర్ కార్లో యిక్కడికొచ్చారా? ఇద్దరు పొట్టిగా లావుగా వుంటారు. తతిమ్మా యిద్దరూ పొడుగ్గా వుంటారు."

"చెప్పలేను సార్," అన్నాడు కార్ల వాచ్‌మన్.

పరశురామ్ పదిరూపాయల నోటును అతడికి కనిపించేలా పట్టుకొన్నాడు.

"చెప్పగలిగితే యీ నోటు నీదవుతుంది. ఆ నలుగురిలో ఒకతను చుట్ట కాలుస్తాడు!"

"వాళ్ళు గుర్తున్నారు సార్. ఇక్కడికి యీ మధ్య రాలేదు. మునుపు వచ్చేవారు. వాళ్ళకు చాలా కార్లు వుండుండాలి. వేరు వేరు కార్లలో వాళ్ళు వచ్చారు."

"ఆ కార్ల పేర్లు చెప్పగలవా?"

"నల్ల అంబాసిడర్, క్రీమ్ కలర్ ఫియట్, బ్లూ హెరాల్డ్, గ్రీన్ హిల్‌మన్ కార్లలో వాళ్ళు రావడం నేను చూశాను, సార్. బాగా మందుకొట్టి సినిమా కొస్తారు," అన్నాడు వాచ్‌మన్.

పరశురామ్ పది రూపాయల నోటును అతడి కిచ్చేశాడు.

"ఈ సారి వాళ్లు సినిమాకొస్తే యీ నెంబర్కి ఫోన్ చేసి చెప్పు! నీకు వందరూపాయలు వస్తుంది," అని పరశురామ్ తన కార్డు యిచ్చాడు.

"అలా చేస్తే నాకు ప్రమాదం రాదుగా?"

పరశురామ్ నవ్వాడు.

"మొగాడివి. భయపడకు! ప్రమాదమొస్తే ఎదుర్కో. నాకు ఫోన్ చేస్తే నే నొచ్చి కాపాడ్తాను."

"అలాగే సార్,"

"ఆ కార్డు ఎవ్వరికీ చూపించకు! మనం మాట్లాడిన దంతా రహస్యంగా వుంచు."

"అలాగే సార్!" అన్నాడతను.

పరశురామ్ కారును పోనిచ్చాడు. వాళ్ళు కార్లనూ, కార్ల నెంబర్లనూ మారుస్తూ వుంటారని స్పష్టంగా తెలుస్తోంది. అతడు కారును స్పీడుగా మరికొన్ని రోడ్లమ్మట పోనిస్తూ, ఆలోచించసాగాడు. ఇదే విధమైన యేర్పాటు యితర థియేటర్ల వద్ద కూడా చేస్తే బాగుంటుందని పించింది.

7

గీతా థియేటర్లో లైట్లు వెల్గుతున్నాయి. గోపాల్, రాధిక పక్కపక్కనే కూర్చున్నారు. వాళ్ళ పెళ్ళయి వారం రోజులైంది.

రాధిక వయస్సు పద్ధెనిమిది సంవత్సరాలుంటుంది. ఆమె చాలా అందంగా వుంది. బంగారంలాంటి శరీర చ్ఛాయ. విశాలమైన కాటుక కళ్ళు. తీర్చిదిద్దిన ముక్కు. ఎర్రటి పెదిమలు. పట్టుచీర ధరించిందామె. జడలో గులాబీలు, మల్లెపూలు వున్నాయి.

ఒక చాక్లెట్‌ను సగం కొరికి గోపాల్ ఆమెకిచ్చాడు. ఆమె నవ్వుతూ నోట్లో పడేసుకుంది.

"నైట్ షోకి నేనింత వరకూ వెళ్ళలేదు," అందామె.

"నైట్ షోలంటే నాకెంతో సరదా. భోజనం ముగించి హాయిగా సినిమా చూడొచ్చు. ఇంటికెళ్ళాక హాయిగా నిద్ర పట్టేస్తుంది," అన్నాడు గోపాల్.

"నిద్ర పోయేవాడికి పెళ్ళెందుకు?" అంది రాధిక అతడి వంక కొంటెగా చూస్తూ.

"నిద్రపోసులే! ఆఫీసుకు వెళ్ళక్కర లేదుగా? పగలు పడుకోవచ్చు," అన్నాడతను.

"నీతో ఎంతో మాట్లాడాలి!" అందామె.

"దేన్ని గురించి?"

"నేనొక నవల చదివాను. అందులో లవర్స్ చాలా అనురాగంతో జీవిస్తారు. ఒకర్నొకరు విడిచి క్షణం కూడా వుండలేరు...."

"అది జీవితంలో సాధ్యంకాదు, రాధికా. మొగుడు ఆఫీసు కెళ్ళాలి. డబ్బు గడించాలి. చేతిలో డబ్బు లేక పోతే ప్రేమ హరించిపోతుంది."

"నిజమైన ప్రేమ దేన్నీ కోరదు!" అందామె.

"ఆ నిజమైన ప్రేమంటే ఎలా వుంటుందో నేను, నీ దగ్గర నేర్చుకుంటాలే," అన్నాడతను, ఆమెవంక ఓరగా, సంతోషంగా చూస్తూ.

కార్లు ఆపే స్థలంలో క్రీమ్ రంగు ఫియెట్ ఆగింది. నలుగురు మనుషులు కిందకు దిగారు. కార్లను చూసే యువకుడు వాళ్ళవైపు చూశాడు. అతడి మెదడులో ఏదో మెరిసింది.

"సార్?" అన్నాడతను.

"ఏమిటి?" అడిగాడు ముల్లా.

అతడి నోట్లో చుట్ట వెల్గుతోంది.

"ఒకాయన మిమ్మల్ని గురించి నన్ను అడిగాడు. మీరు సినిమా కొస్తే ఫోన్ చేసి చెప్పమన్నాడు. వంద రూపాయ లిస్తానన్నాడు."

ముల్లా తతిమా వాళ్ళవంక చూశాడు.

"ఎవరతను?" అడిగాడు మస్తాన్.

"పేరు చెప్పలేదు. టెలిఫోన్ నెంబర్ చెప్పాడు,"

అబద్ధమాడాడు వాచ్‌మన్.

"ఆ నెంబరు చెప్పు," అన్నాడు పైడిరాజు.

వాచ్‌మన్ నెంబరు చెప్పాడు.

"ఈ నెంబరెవర్దో నేను కనుక్కొస్తాను," అన్నాడు నాయుడు.

"డోంట్ బాదర్!" అని ముల్లా వాచ్‌మన్ వంక చూశాడు.

"వాచ్‌మన్, మేం వచ్చినట్లు చెప్పకు. నీకు రెండు వందలు యిస్తాం" అన్నాడు ముల్లా.

వాచ్‌మన్ రెండు నోట్లనూ జేబులో దాచేసుకున్నాడు.

"ప్రాణంపోయినా నేను చెప్పను, సార్" అన్నాడు.

"అంతే, వీడి నోరు నొక్కేశాం" అని ముల్లా ముందుకు నడిచాడు, చుట్టను పక్కకి విసురుతూ.

తతిమ్మా ముగ్గురూ అతడిని వెంబడించారు.

"వాడు ఫోన్ చేసి చెప్తే?" అడిగాడు నాయుడు.

"చెప్పడు. జేబులోని నోట్లు అతడి నోటికి తాళం వేస్తాయి" అన్నాడు ముల్లా.

ముగ్గురూ థియేటర్లోకి వెళ్ళిపోయారు.

గోపాల్ వెనక్కి తిరిగి చూశాడు. నలుగు వ్యక్తులు అప్పుడే వచ్చి వెనక కుర్చీల్లో కూర్చున్నారు. వాళ్ళనుంచి బ్రాందీ వాసన కొడ్తోంది. లైట్లు ఆరిపోయాయి.

గోపాల్ ఆప్యాయంగా ఆమె చెయ్యిని పట్టుకుని వేళ్ళను నిమిరాడు. ఆమె దగ్గరకు వంగి చెవిలో ఏదో చెప్పాడు. ఆమె కిలకిల నవ్వింది.

"నువ్వెప్పుడేనా ఎలుగుబంట్లను చూశావా?" అడిగాడు గోపాల్ తగ్గు స్వరంలో.

"లేదు" అందామె.

"లైట్లు వచ్చాక చూడు, వెనక కూర్చున్నాయి."

"జంతువులు సినిమాలు చూస్తాయా?" అందామె.

"సినిమాల్లో జంతువులు నటిస్తున్నాయిగా, అవి సినిమాలు చూస్తే మనం ఆశ్చర్యపడకూడదు" అన్నాడు గోపాల్.

ఆమె కిలకిల మళ్ళా నవ్వింది.

8

కార్లు వాచ్‌మన్ ఆలోచిస్తున్నాడు. తనకు అనుకోకుండా రెండొందలు వచ్చింది. అతడు యిస్తానన్న వందను ఎందుకు పోగొట్టుకోవాలి? ఫోన్ చేసి చెప్తే తన వందా తన కొస్తుంది.

సినిమా ప్రారంభమైంది. ఇంక కార్లు రావు. అతడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతడు ఒక నిశ్చయానికొచ్చి బయటకు నడిచాడు.

ధియేటర్ ఎదురుగా టెలిఫోన్ బూత్ వుంది. లోపలి కెళ్ళి అతడు తలుపు మూశాడు. రిసీవరెత్తి నంబరు తిప్పాడు, డబ్బు చిల్లులో పడేశాడు.

"హలో, పరశురామ్" అంది అటువైపు కంఠం.

"నేను గీతా ధియేటర్ వాచ్‌మన్ని సార్. వాళ్ళు వచ్చారు. నాకు వంద యివ్వాలి. మీకు చెప్పానుగా" అన్నాడతను.

"వస్తున్నాను. నీకు డబ్బు యిస్తాను" అన్నాడు పరశురామ్.

అతడు రిసీవర్ పెట్టేసి ధియేటర్ లోకి వెళ్ళిపోయాడు. కార్ల పక్కనే కూర్చుని ఆలోచిస్తూ వుండిపోయాడు. తను ప్రమాదం లేకుండా చూసుకోవాలి.

డాడ్జి కారు లోపలకొచ్చింది. ఒక కారు పక్కనే ఆగింది. వాచ్‌మన్ అటువైపు పరుగెత్తాడు.

"ఇదిగో నీ వందరూపాయలు" అన్నాడు పరశురామ్ ఒక నోటు యిస్తూ.

నోటును వాచ్‌మన్ ఆశతో తీసుకుని దాచుకున్నాడు.

"వాళ్ళు లోపల వున్నారా?"

అతడు తల గోక్కున్నాడు.

"వాళ్ళు వెళ్ళిపోయారు, సార్."

"సినిమాకి వచ్చినవాళ్ళు ఎందుకు వెళ్ళిపోయారు?"

"వాళ్ళు వచ్చి లోపలకెళ్ళారు, సార్. వెంటనే మీకు ఫోన్ చేశాను. వాళ్లు యిప్పుడే వెళ్ళిపోయారు" అన్నాడు వాచ్‌మన్.

పరశురామ్ బయటకు దిగి సిగరెట్ వెలిగించాడు. పొగ వదులూ అతడివంక చూశాడు.

"నేను వస్తానని తెలిసి వాళ్ళు పోయారేమో!"

"నేను చెప్పలేదు, సార్."

"వాళ్ళు ఏ కారులో వచ్చారు?" అడిగాడు పరశురామ్ అక్కడున్న కార్లను చూస్తూ.

"నల్ల అంబాసిడర్ కారులో వచ్చారు, సార్."

"ఆ క్రీమ్‌రంగు ఫియట్ ఎవరిది?"

"అది మరొకళ్ళది సార్."

ఆలోచిస్తూ పరుశురామ్ ఫియట్ దగ్గరకు నడిచాడు. ఫియట్ చుట్టూ తిరిగి చూశాడు. సగంపైన కాల్చినచుట్ట ఫియట్ పక్కనే పడుంది. దాన్ని పరశురామ్ పరీక్షగా చూశాడు.

ఖరీదైన సిగార్! తనకు రోడ్డువారగా దొరికి నటు వంటిదే!

ఆ చుట్టను చూడగానే వాచ్‌మన్ మొహంలో గాభరా గోచరించింది.

అమాంతంగా పరశురామ్ వాచ్‌మన్ మెడను వేళ్ళతో చుట్టి పట్టుకున్నాడు. రెండో చెయ్యి ఆతడు వందరూపాయిల నోటు పడేసుకున్న జేబులోకి వెళ్ళింది.

అతడి చెయ్యి పైకొచ్చింది. మూడు వందరూపాయిల నోట్లు! మూడిటివైపూ పరశురామ్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఒకటి నేనిచ్చాను. తతిమ్మా రెండూ ఎవరిచ్చారు?"

"నెల రోజుల్లో నా పెళ్ళి కాబోతోంది, సార్. మావ ఆ డబ్బు యిచ్చాడు. గుడ్డలు కుట్టించుకోమన్నాడు" బొంకాడతను.

"నీ పెళ్ళి యిప్పుడే అవుతుంది! రాస్కెల్, నిజం చెప్పు" అర్చాడు పరశురామ్.

అతడి గొంతు చుట్టూ పరశురామ్ వేళ్ళు బిగుసుకు పోతున్నాయి.

"వదలండి సార్! సార్, సార్!" అన్నాడతను.

"చెప్పు! నిన్ను చావదన్ని తోలు ఒల్చేస్తాను!"

"వాళ్ళు థియేటర్లో వున్నారు సార్. ఈ కారు వాళ్ళదే సార్. యీ డబ్బు వాళ్ళిచ్చారు. మీకు ఫోన్ చెయ్యొద్దన్నారు. మీ వందకోసం దురాశపడి ఫోన్ చేశాను" అన్నాడతను గాభరాగా.

"ఈ మూడు నోట్లూ నీ దగ్గరే వుంచుకో!" అని పరశురామ్ నోట్లను యిచ్చేశాడు.

"మన్నించండి, సార్!"

"నోరు మూసుకుని నీ పని చూసుకో! నీకే ప్రమాదం

రాదు" అని పరశురామ్ తన కారువైపు నడిచాడు.

డాడ్జి కారును బయటకు మెల్లిగా పోనిచ్చాడు.

9

ఒంటి గంటకు సినిమా ముగిసింది.

గోపాల్, రాధిక బయటకు నడుస్తున్నారు. థియేటర్ బయట టాక్సీలు, ఆటోలు లేవు. సైకిల్ రిక్షాలు మాత్రం వున్నాయి.

"రిక్షాలో పోదామా?" అందామె.

"అరగంటలో యింటికి పోవచ్చు, నడుద్దాం" అన్నాడతను.

ఇద్దరూ రోడ్డు వారగా నడుస్తున్నారు. రాధిక చూసిన సినిమా గురించి చెప్తోంది.

"పాపం, కథానాయిక మహా కష్టపడింది. విలన్ ఆమెను ముప్పుతిప్పలూ పెట్టాడు" అందామె.

గోపాల్ వెనక్కు చూశాడు. ఏదో కారు వస్తోంది. సమీపంలో ఎవ్వరూ లేరు. చటుక్కున కారు వాళ్ళ పక్కనే ఆగింది. తలుపు తెరిచి యిద్దరు కిందకు దిగారు. రాధికను కార్లో యీడ్చి కూర్చోబెట్టారు. కారు దూసుకు పోయింది.

గోపాల్ అరుస్తూ కారు వెనక పరుగెడుతున్నాడు.

"కార్ను ఆపండి! నా భార్య! నా వైఫ్!" బొబ్బ లెడుతున్నాడతను.

గోపాల్ వెనక మరో కారు ఆగింది.

"గెటిన్!" అన్నాడు పరశురామ్.

గోపాల్ టక్కున ఎక్కి కూర్చుని తలుపు మూశాడు. పరశురామ్ కారును పోనిచ్చాడు.

"ఆ కార్ను ఆపి, నా భార్యను రక్షించి పుణ్యం

కట్టుకోండి! ప్లీజ్!" గోపాల్ పిచ్చిగా చూస్తున్నాడు.

"మిస్టర్ భయపడకు! నీ భార్యకు ప్రమాదం రాకుండా నేను చూస్తాను. ఆ కారును ఆపుతాను" అన్నాడు పరశురామ్.

పరశురామ్ స్పీడు హెచ్చించాడు. ముందు కారు వెనుక లైట్లు కనిపిస్తున్నాయి.

డాడ్జి కారు విమానంలా దూసుకుపోతోంది. ఫియట్ బాగా దగ్గరైంది. తటాలున ఫియట్ ఎడంవైపు రోడ్డు మీదకు తిరిగింది. ఆ రోడ్డుమీద జనసంచారం లేదు.

పరశురామ్ తన కారును అటువైపు తిప్పి పోనిచ్చాడు. ఫియట్ కారు డ్రయివర్ కొంచెం ఎడంవైపుకు వెళ్ళి వెనక వస్తున్న కారుకు తోవ యిస్తున్నట్లు సౌంజ్ఞ చేశాడు.

ఫియట్‌ను దాటి డాడ్జి కారు వెళ్ళిపోయింది. కొంచెం దూరం వెళ్ళాక పరశురామ్ సడెన్ బ్రేక్‌తో కార్ను ఆపాడు. వెనకనే ఫియట్ ఆగవలసి వచ్చింది.

తలుపు తెరిచి పరశురామ్ కిందకు దూకాడు. అతడి చేతిలో పిస్టల్ మెరుస్తోంది.

ఫియట్ తలుపులు తెరవబడ్డాయి. నలుగురూ బయటకు దిగారు. వాళ్ళ చేతుల్లో కత్తులున్నాయి. ఫియట్ కారులో కూర్చున్న రాధిక భయంతో అంతా గమనిస్తోంది.

పరశురామ్ వాళ్ళవైపు రెండుసార్లు షూట్ చేశాడు. పెదిరాజు అరుస్తూ కిందపడ్డాడు. రెండో బులెట్ కారుకి కొట్టుకుంది.

ముల్లా, మస్తాన్, నాయుడు వెనక్కి తిరిగి పరుగెడుతున్నారు. పరశురామ్ వాళ్ళ వెనక చిరుతపులిలా పరుగెత్తాడు.

నాయుడిని వెనకనుంచి తన్నాడు. అతడు రోడ్డు

వారగా పడ్డాడు. మరోసారి పారిపోతున్న వాళ్ళవైపు షూట్ చేశాడు.

"రాస్కెల్స్! చేతులెత్తండి, లేకపోతే చస్తారు!" గర్జించాడు పరశురామ్.

కొంచెం దూరంలో చేతులెత్తి ముల్లా, మస్తాన్ నిలబడ్డారు.

పరశురామ్ వాళ్ళ దగ్గరకు నడిచాడు. ఒక దెబ్బతో ముల్లా చంప పగిలి నోటమ్మట రక్తం కారింది. మరో దెబ్బకు మస్తాన్ మెడ తిరిగినట్లయింది. వాళ్ళకు వెనక నుంచి తన్నుతూ పరశురామ్ కార్లవైపు కదిలాడు. రోడ్డు పక్క పడిన నాయుడు మూలుగుతూ లేచాడు. అతడిని బలంగా తన్నాడు పరశురామ్. అతడు రోడ్డుమీద దొర్లుతూ ఫియట్ పక్కనే పడ్డాడు.

నేలమీద పడున్న పైడిరాజు కాలినుంచి రక్తం కారోంది.

"అందరూ చేతులు వెనక్కి కట్టుకొని నిలబడండి!" అర్చాడు పరశురామ్.

మస్తాన్, ముల్లా, నాయుడు అలాగే చేశారు. వాళ్ళ చేతులను నైలాన్ తాడుతో గోపాల్ కట్టేశాడు.

రాధిక చేతులెత్తి పరశురామ్‌కి నమస్కరించింది.

"వీళ్ళకోసం నేను థియేటర్ ముందు కార్లో కాచుకుని కూర్చున్నాను. నీకు ఏ ప్రమాదమూ రాకుండా కాపాడగలిగినందుకు ఆనందిస్తున్నాను" అన్నాడు పరశురామ్, ఆమెను ఓదారుస్తూ.

"ఇక్కడనుంచి ఎలా వెళ్ళడం?" అంది రాధిక.

"డోంట్ బాదర్, నేను దింపుతాను" అన్నాడు పరశురామ్.

ఏదో స్కూటర్ రోడ్డమ్మట పోసుకొస్తోంది. స్కూటర్ వాళ్ళ ముందు ఆగింది.

"మీరా?" అన్నాడు మోహన్.

"ఆ దుర్మార్గులు వీళ్ళే!" అన్నాడు పరశురామ్ వాళ్ళ వైపు చూపిస్తూ.

మోహన్ అమాంతం కిందకు దూకాడు. ఉద్రేకంతో జేబులోంచి కత్తిని తీశాడు.

"మీ రక్తం తాగుతాను! మిమ్మల్ని నరికి మీ మాంసాన్ని గద్దలకు పడేస్తాను!" పిచ్చిగా అరుస్తున్నాడు మోహన్.

పరశురామ్ అతడి చేతిలోని కత్తిని లాక్కున్నాడు.

"మిస్టర్ మోహన్, మన దేశంలో కోర్టులున్నాయి. వాళ్ళు చేసిన నేరాలకు తగిన శిక్ష విధించబడుతుంది" అన్నాడు పరశురామ్.

వాళ్ళవైపు పళ్ళు కొరుకుతూ చూశాడు మోహన్.

"మిస్టర్ మోహన్, నువ్వు వెళ్ళి ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి ఫోన్ చెయ్యి! వెంటనే యిక్కడకు రమ్మను" అన్నాడు పరశురామ్.

మోహన్ స్కూటర్ని స్టార్ట్ చేసి పోనిచ్చాడు. సిగరెట్ పొగ పీల్చి వదుల్తూ పరశురామ్ రోడ్డుమీద యిటూ, అటూ పచార్లు చేయసాగాడు. ఇన్‌స్పెక్టర్ రాకకోసం అతడు ఎదురు చూస్తున్నాడు!

—: ఐపోయింది :—